క్లుప్తంగా

అథ్లెటిక్ పోటీలకు ఏపీటీడబ్ల్యూఆర్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక కావటంపై ప్రిన్సిపాల్ పెంటన్న హర్షం వ్యక్తం చేశారు. గత నెల 31వ తేదీన యర్రగొండపాలెంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ధనరాజ్ నాయక్, మల్లికార్జున నాయక్‌లు చక్కటి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 9,10,11వ తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరుగుతాయని తెలిపారు. క్రీడాకారులను ఫిజికల్ డైరెక్టర్ తులసీ నాయక్, ప్రతాప్‌నాయక్‌లు అభినందించారు.

కుక్కల బెడదతో హడల్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చీకటి పడగానే నడిచి వెళ్లేవారు, వాహనదారులను కుక్కలు వెంటాడుతుండటంతో తప్పించుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. కుక్కల బెడదను నివారించాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరలో గంజాయి నిందితుల అరెస్టు

పొదిలి రూరల్: పొదిలిలో గంజాయి వ్యాపారం చేసే వ్యక్తులను గుర్తించామని, త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్సై వేమన చెప్పారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. పొదిలి పరిసర ప్రాంతాలలో గంజాయి అమ్మేవారు, సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. అలాగే పొదిలి ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంది విత్తనాల పంపిణీ

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని అక్కచెరువు గ్రామంలో రైతులకు గురువారం దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదర్శ అపరాల పథకం కింద ఎల్‌ఆర్‌జీ–52 కంది రకం విత్తనాలు పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌జీ–52 రకం విత్తనాలు 160–170 రోజుల్లో కోతకొస్తుందని, ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశముందని చెప్పారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి వెబ్ ల్యాండ్‌లో రైతు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాని వారు వెంటనే చేయించుకోవాలని ఏఓ శ్రీనివాసరెడ్డి సూచించారు.

భక్తిశ్రద్ధలతో పట్టాభిరాముడి ప్రతిష్ఠ ఉత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని మర్రిపాలెం బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన పట్టాభిరామ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పలువురు ఉభయదాతలు కంకణాలు ధరించి హోమాల్లో పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎఫ్ఆర్ఓ

మార్కాపురం: అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని మార్కాపురం అటవీ శాఖ నూతన ఎఫ్ఆర్ఓ ఎస్.పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఆయన నెల్లూరు జిల్లా గోనుపల్లె సెక్షన్ డీఆర్ఓగా పనిచేస్తూ పదోన్నతిపై మార్కాపురం అటవీశాఖ ఎఫ్ఆర్ఓగా నియమితులయ్యారు. గురువారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నూతన ఎఫ్ఆర్ఓను డీఆర్ఓ నాగరాజు, సిబ్బంది ఖాజా రహ్మతుల్లా, ప్రసాద్‌రెడ్డి, రవికుమార్, బాలాకుమారి, ఏడుకొండలు, జాన్సన్, ధనుశ్రీ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై రూ.3.17 లక్షల జరిమానా

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో స్థానిక ఏడీఈ బీవై శేషగిరిరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముండ్లపాడు, బురుజుపల్లె, ఉయ్యాలవాడ, సంజీవరాయుడుపేట, తాళ్లపల్లె తదితర గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. మీటరు ఉండి, మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి మొత్తం రూ.3.17 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఏడీఈ వివరించారు. దాడుల్లో ముండ్లపాడు ఏఈ వెంకటేశ్వరావు, గిద్దలూరు ఏఈ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మోసం, వెన్నుపోటులో చంద్రబాబు దిట్ట

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దారవీడు: ఎన్నికలకు ముందు మొసలి కన్నీరు కార్చడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసి వెన్నుపోటు పొడవటం, డైవర్షన్ రాజకీయాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రం పెద్దారవీడులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ మండల విస్తృత స్థాయి సమావేశానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. తొలుత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అక్కడి నుంచి ఊరేగింపుగా సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన అందిస్తే కూటమి ప్రభుత్వం పాలన వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులు, అరెస్టులతో కాలం వెళ్లదీస్తోందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం కూటమి పాలనలో పరిపాటిగా మారిందన్నారు. ఏడాది పూర్తయినా నేటికీ రేషన్ కార్డులు, పేదలకు ఇళ్లు అందించిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో 3 లక్షల కోట్ల నిధులతో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని, చంద్రబాబు చరిత్రలో ఎప్పుడైనా పథకాలు అందించిన పాపాన పోలేదని విమర్శించారు. గ్రామాల్లో నీటి సంఘ అధ్యక్ష పదవి, కార్యవర్గ సభ్యులకు ఎన్నికలు జరిపే దమ్ము టీడీపీ నాయకులకు లేక వైఎస్సార్ సీపీ నాయకులను బెదరించి ఏకగ్రీవం చేసుకున్నారని చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయక మరో వైపు అబద్ధాలతో సీఎం అయిన చంద్రబాబు నైజాన్ని గడప గడపకు చెప్పాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో పూర్తిగా కూటమి ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు తెలియపర్చే కర్తవ్యం ప్రతి ఒక్క నాయకుడికి, కార్యకర్తకు ఉందన్నారు. కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, త్వరలోనే ప్రజలు తిరగబడే రోజులు వస్తాయన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం, చరిత్రలో ఎన్నడూ జరగని అభివృద్ధిని తామే చేశామని ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి చెప్పడం వైఎస్సార్ సీపీకే సాధ్యమని స్పష్టం చేశారు.

హామీలన్నీ తూచ్

చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చి ఒక్క హామీని అమలు చేయలేదని, అదే విధంగా ఇప్పుడూ అధికారం చేపట్టి ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకుండా తూచ్ అంటున్నారని ఎమ్మెల్యే తాటిపర్తి తీవ్రంగా మండిపడ్డారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా ఇసుక అమ్ముకోవడం, గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేయడంతో మద్యం ఏరులై పారుతోందన్నారు. రైతులు పండించిన పంటలకు మాత్రం మద్దతు ధర కల్పించడంలో కూటమి నాయకులు ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు జీవితమంతా అబద్ధాలు, మోసాలు చేయడం అలవాటుగా మార్చుకున్నారన్నారు. తల్లికి వందనం ఎంత మందికి వచ్చిందో, గ్యాస్ సబ్సిడీ ఎంత మందికి వచ్చిందో, అన్నదాత సుఖీభవ పథకం ఎంత మందికి వచ్చిందో తెలియదన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో పేదలకు 30 లక్షలు ఇంటి పట్టాలు ఇచ్చారని, 25 లక్షలు ఇళ్లు కట్టించారని గుర్తు చేస్తూ సీఎం చంద్రబాబు పాలనలో పేదలకు ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వకపోవడంతో పాటు ఇంటి నిర్మాణాలు నిలిపేశారన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలకు నిధులు మంజూరు చేసి వాటిని నిర్మాణం చేపట్టితే ఇప్పుడు ప్రైవేట్ వైద్యశాలలకు నష్టం వాటిల్లుతోందని, ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాలను నిలిపివేసిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు. నియోజకవర్గంలో పెద్దారవీడు మండలం వైఎస్సార్ సీపీకి కంచుకోటగా నిలిచిందని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ కంటే వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజార్టీ తెచ్చిన మండల ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, పార్టీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ నూర్ అహ్మద్, పార్టీ ఇంటిలెక్చువల్ జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి, నియోజకవర్గ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షుడు వనపర్తి మాలతి, ఎంపీటీసీ దుదెకుల పకీరయ్య, సర్పంచ్‌లు దుగ్గెం చెన్నమ్మ, పొందుగుల వెంకటరెడ్డి, కొర్ర భూలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచుకోటలో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



ఎమ్మెల్యే తాటిపర్తిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు



బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- ఊరూరా కదలిన జగనన్న సైన్యం
- పెద్దారవీడులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సభ సక్సెస్
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు కార్యకర్తల ఘన స్వాగతం
- జగనన్నతోనే రామ రాజ్యం..అంటూ నినాదాలు

యర్రగొండపాలెం: పశ్చిమ ప్రాంత వరదాయిని వెలిగొండ ప్రాజెక్ట్ ఆయువు పట్టయిన సుంకేసుల గ్యాప్ నుంచి వివిధ ప్రాంతాలకు కృష్ణమ్మ బిరబిర పారే విధంగా జగనన్న సైనికులు మండల కేంద్రం పెద్దారవీడులో గురువారం జరిగిన బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఊరూరా స్వచ్ఛందంగా యువకులు తమ బైక్‌లకు వైఎస్సార్ సీపీ జెండాలు కట్టుకొని రెపరెపలాడించుకుంటూ సభా స్థలికి చేరుకున్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌కు గ్రామ శివారులో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన మోటారు బైకుల ర్యాలీలో పాల్గొని యువకులను మరింత ఉత్సాహ పరిచారు. ముందుగా బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఆయన ప్రజలకు అభివాదం తెలిపారు. అక్కడి నుంచి సభా ప్రాంగణానికి ర్యాలీగా వెళ్లారు. నాయకులు చేస్తున్న ప్రసంగాలకు ఉత్తేజంగా ఈలలు వేస్తూ చప్పట్లు కొట్టారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభలో పాల్గొని జగనన్నతోనే రామరాజ్యం సాధ్యమంటూ నినాదాలు చేశారు. ప్రజలను మోసం చేసిన బాబు వెంటనే గద్దెదిగాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక కూటమి ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందా..అని ఎదురు చూస్తున్నామని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనేనని కేకలు పెట్టారు. సభ ప్రారంభం నుంచి చివరి వరకు జగన్‌మోహన్‌రెడ్డి జిందాబాద్, తాటిపర్తి చంద్రశేఖర్ నాయకత్వం వర్ధిల్లాలి..అంటూ ఆ ప్రాంతం దద్దరిల్లే విధంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎంతో హుషారుగా కార్యక్రమంలో పాల్గొన్న వారు అంతకంటే ఎక్కువ హుషారుగా బాబు మోసం గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తామని వాగ్దానం చేశారు. పార్టీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, జెడ్పీటీసీ యేర్వ చలమారెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి షేక్ బుజ్జి, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, వివిధ విభాగాల నాయకులు వై.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.అరుణాబాయి, కె.ఓబులరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, పి.రాములు నాయక్, కాసు వెంకటరెడ్డి, పంది గురవయ్య, గాదం మల్లికార్జున, మోటకట్ల వెంకిరెడ్డి, కీరనాయక్, అల్లు వెంకటేశ్వరరెడ్డి, సొంటి నాగార్జునరెడ్డి, నరాల రామచంద్రుడు, వెన్నా పెద్దపోలిరెడ్డి, దుగ్గెంపూడి పెద్ద వెంకటరెడ్డి, పులి సుబ్బయ్య పాల్గొన్నారు.

కనీస అవసరాలు తీర్చేందుకు రోటరీ క్లబ్ కృషి



రోటరీ సభ్యులు

దర్శి: కనీస అవసరాలు తీర్చడంలో రోటరీ క్లబ్ ముందుంటుందని రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ శివన్నారాయణ, అసిస్టెంట్ గవర్నర్ అంకమ్మ చౌదరి అన్నారు. స్థానిక వీఆర్ గ్రాండ్‌లో దర్శి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణస్వీకార మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం దర్శి రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా బోయిల్ల నాగేశ్వరరెడ్డి, కార్యదర్శిగా అంబవరపు నారాయణరెడ్డిలను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా శివన్నారాయణ, అంకమ్మ చౌదరి హాజరై నూతన అధ్యక్ష, కార్యదర్శులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీ అంటే సేవా అనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. రోటరీ 200 దేశాల్లో తమ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సేవ ద్వారానే మానవ జన్మకు సార్థకత ఏర్పడుతుందని, మానవ సేవే మాధవ సేవ అని చెప్పిన స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని సమాజానికి అవసరమైన సేవలు అందిస్తూ దర్శి రోటరీ క్లబ్ మంచి పేరు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు. రోటరీ కుటుంబ సభ్యులందరూ పర్యావహితంగా జీవించాలని, పర్యావరణం కాపాడుకోవడంలో సమాజానికి రోటరీ క్లబ్ సభ్యులు ఆదర్శవంతంగా ఉండాలన్నారు. ఆ విధంగా జీవన ప్రమాణాలు పాటించడంలో భాగంగా రోటరీ సభ్యులు ఒక్కొక్కరు ఒక మొక్కని తప్పనిసరిగా పెంచి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కేవీ రెడ్డి, రాజారెడ్డి, రమణారెడ్డి, నారాయణరెడ్డి, దుర్గారెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, పానుగంటి కోటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

పుల్లలచెరువు: తల్లిపాలు బిడ్డకు అమృతమని సీనియర్ అంగన్‌వాడీ కార్యకర్తలు బేబిరాణి, కుమారి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రం అంగన్‌వాడీ కేంద్రంలో గురవారం తల్లిపాల ముగింపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలతో గర్భిణులు, చిన్నారులు, తల్లులకు పౌష్టికాహారం అందజేస్తామని చెప్పారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలను బిడ్డకు పట్టిస్తే ఆరోగ్యంగా చిన్నారులు ఉంటారన్నారు. తల్లిపాలలో వ్యాధినిరోధిక శక్తి ఎక్కువ ఉంటుందంటూ తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు పిల్లలకు అన్ని సౌకర్యాలు అందజేసిన తల్లులను సన్మానించారు.

డిగ్రీ కళాశాలకు పది బెంచీల వితరణ



బెంచీలు అందించిన దాతలను సత్కరిస్తున్న అధ్యాపకులు

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు కూర్చోవడానికి సౌకర్యార్థంగా ఉండే బెంచీలను దివంగత చావా వెంకట నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి మనువడు నాగచైతన్య పది బెంచీలు బహూకరించారు. దర్శికి చెందిన నాగచైతన్య కెనడాలో స్థిరపడ్డారు. వీరి మామ ఎంఆర్ఎఫ్ టైర్ల డీలర్ చావా శ్రీనివాసరావు, సంఘ సేవకుల విజ్ఞప్తి మేరకు బెంచీలు ఇచ్చినట్లు నాగచైతన్య తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రభుదాస్, ఇంగ్లిష్ అధ్యాపకులు డాక్టర్ ఏ.నగేష్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ గంథం వేణు, కంప్యూటర్ అధ్యాపకుడు కె.రవీంద్ర, సహ ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం దాతలను పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



శివ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మార్కాపురం: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న పెద్దదోర్నాల మండలం చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన కౌలురైతు నాలి శివ కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకుడు దగ్గుబాటి సోమయ్య డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు శివ మృతదేహాన్ని గురువారం స్థానిక జీజీహెచ్‌లో సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిట్టుబాటు ధరలు లేకపోవడం, అప్పులు పెరగడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతులను ఆదుకునే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేయడం లేదని, గిట్టుబాటు ధరలను కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు తీసుకుని వ్యవసాయం చేయడం వల్ల వడ్డీ పెరిగి బాకీ చెల్లించలేని స్థితిలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలి శివ గత పదేళ్ల నుంచి వ్యవసాయం చేస్తూ ఆదాయం లేక చేసిన అప్పులు రూ.25 లక్షలకు చేరడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.బాలనాగయ్య, తిరుపతిరెడ్డి, రూబెన్ పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చనలు



కుంకుమార్చనలో భక్తులు

త్రిపురాంతకం: శ్రావణ మాసం సందర్భంగా శ్రీబాలా త్రిపురసుందరీదేవి ఆలయంలో భక్తులచే సామూహిక కుంకుమార్చనలు గురువారం వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో ఏటా శ్రావణ మాసంలో మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ప్రసాదాలు, కుంకుమ, గాజులు మహిళలకు అందించారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



మాట్లాడుతున్న ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు సచివాలయంలో ఐదేళ్లుగా సేవలు అందించి బదిలీపై వెళ్లిన, బదిలీపై వచ్చి బాధ్యతలు అందుకున్న సచివాలయ ఉద్యోగులను గ్రామ సర్పంచ్ మందా శ్యాంసన్, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డిలు గురువారం స్థానిక సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు అనేక సేవలు చేశారని వారి పనితీరును ప్రశంసించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కూడా వారిని ఆదర్శంగా తీసుకుని ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు కె.బాలకోటయ్య, పంచాయతీ కార్యదర్శులు షేక్ షహనాజ్ బేగం, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

పొదిలి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పొదిలి సెయింట్ మేరీ బీఈడీ కళాశాలలో ఉన్నత పాఠశాలలు, మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 906 మంది ప్రధానోపాధ్యాయులకు 4 రోజుల చొప్పున మూడు విభాగాల్లో పాఠశాల నాయకత్వంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను అమలు చేస్తూ తోటి ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయాలని చెప్పారు.

